క్లుప్తంగా

ఎంఈఓకు సన్మానం



ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న మంత్రి హరీశ్‌రావు

కొండపాక(గజ్వేల్): కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లోని 16 హైస్కూళ్లు 10వ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణతను సాధించడంతో ఎంఈఓ పి.శ్రీనివాస్‌రెడ్డిని ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు బుధవారం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మకమైన మార్పులు తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు మన ఊరు–మన బడి పథకంలో పనులు జరిగాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యలు పెరిగేలా ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, జెడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ, డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హార్ట్‌ఫుల్‌నెస్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నిర్వాహకులు

సిద్దిపేటజోన్: పట్టణంలోని టీఎన్జీఓ భవన్‌లో బుధవారం హార్ట్‌ఫుల్‌నెస్ ఆధ్వర్యంలో యోగా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా యోగ ప్రాముఖ్యత, ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి కృష్ణారావు, స్థానిక సెంటర్ ఇన్‌చార్జి స్వరూప, సెట్విన్ ఇన్‌చార్జి అమీనా తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకరూరల్: గ్రామంలోని ప్రతి ఇంటికీ తిరుగుతూ విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో చేరే విధంగా కృషి చేయాలని ఎంపీ ప్రభాకర్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని రాజక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. పాఠశాలకు చుట్టూ కంపౌండ్ లేకపోవడంతో పాఠశాలలోకి కోతులు, పశువులు వస్తున్నాయని గ్రామస్తులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. కంపౌండ్ నిర్మాణానికి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీ మాట్లాడుతూ.. మన ఊరు–మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలలు కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చెందాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని కోరారు. కార్యక్రమంలో రాజిరెడ్డి, పర్వతాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బక్రీద్‌కు ఏర్పాట్లు చేయాలి

సిద్దిపేటజోన్: బక్రీద్ సందర్భంగా అన్ని మసీదులు, ఈద్గా మైదానం వద్ద పారిశుద్ధ్య పనులు, తదితర ఏర్పాట్లు చేయాలని 33వ వార్డు కౌన్సిలర్ తస్లీమ్ మోహిజ్ ఆధ్వర్యంలో మైనార్టీలు మున్సిపల్ కమిషనర్ సంపత్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. చెత్త చెదారం తొలగించి, నీటి వసతి, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ నెల 29, 30 జూలై 1 తేదీల్లో చెత్త సేకరణ వాహనాలు మైనార్టీలు అత్యధికంగా ఉన్న వార్డుల్లో అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు.

యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో 7కే వాక్‌థాన్



వాక్‌థాన్‌లో బ్యాంక్ సిబ్బంది

సిద్దిపేటకమాన్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ కార్యాలయం ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణంలో బుధవారం సిబ్బంది 7కే వాక్‌థాన్ నిర్వహించారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి ముస్తాబాద్ చౌరస్తా వరకు వాక్‌థాన్ నిర్వహించారు. అదేవిధంగా అన్ని బ్యాంకుల సిబ్బంది వారి కార్యాలయాల్లో యోగా డే నిర్వహించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యజిత్ మాట్లాడుతూ.. వ్యవసాయం, పరిశ్రమలు, శ్రీశక్తి, వ్యక్తిగత రుణాలు, గృహ, విద్యా రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. ఖాతాదారులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రీజినల్ హెడ్ వికాస్, చీఫ్ మేనేజర్లు రమేశ్, గోపి, గ్యానచంద్, సురేశ్, చైతన్య, తేజనాయక్, విజయ్, భరత్, మధు తదితరులు పాల్గొన్నారు.



హుస్నాబాద్: ఎల్లమ్మ చెరువు కట్టపై యోగాసనాలు వేస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ తదితరులు



దుబ్బాకలో యోగాసనాలు వేస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు, నాయకులు



హుస్నాబాద్ కోర్టు ఆవరణలో యోగాసనాలు వేస్తున్న జడ్జిలు శివరంజని, కృష్ణతేజ్



గజ్వేల్‌రూరల్: విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న జడ్జి ప్రియాంక



సిద్దిపేట కోర్టు ఆవరణలో..

యోగాతో మానసిక ప్రశాంతత

జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టుల వద్ద యోగా శిక్షకులు యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా యోగాతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, జడ్జిలు, విద్యార్థులు పాల్గొన్నారు.



రాయపోలు(దుబ్బాక): వడ్డేపల్లి పాఠశాలలో..



ములుగు(గజ్వేల్): యోగాసనాలు వేస్తున్న అటవీ కళాశాల విద్యార్థులు



జగదేవ్‌పూర్(గజ్వేల్): ఇటిక్యాలలో యోగా చేస్తున్న గ్రామస్తులు



సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో..



హుస్నాబాద్: యోగాసనాలు వేస్తున్న మహిళలు

హుస్నాబాద్: యోగాతో మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఎల్లమ్మ చెరువు కట్టపై ప్రజలు, మహిళలు, విద్యార్థులు అందరూ కలిసి యోగాసనాలు వేశారు. యోగా టీచర్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, చీకోటి మహేశ్‌లు యోగాతో కలిగే ప్రయోజనాలను వివరిస్తూ వివిధ రకాల యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి జీవితంలో యోగా ఒక భాగం కావాలన్నారు. అనంతరం ఆయన యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజని, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

హుస్నాబాద్ కోర్టు ఆవరణలో..

హుస్నాబాద్: యోగా సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇస్తుందని, ప్రతి మనిషి దైనందిన జీవితంలో యోగా ఒక భాగం కావాలని హుస్నాబాద్ సివిల్ కోర్టు జూనియర్ జడ్జి శివరంజని అన్నారు. బుధవారం కోర్టు ఆవరణలో యోగాసనాలు వేశారు. నిత్యం యోగాసనాలు, ధ్యానం చేయడంతో ఏకాగ్రతను పెంచుతూ శరీరంలోని అన్ని అవయవాలకు రక్త ప్రసరణ మెరుగుపర్చుతుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ జడ్జి కృష్ణతేజ్, ఏజీపీ కన్నోజు రామకృష్ణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: ప్రతి నిత్యం యోగాసనాలు వేయడంతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటామని అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక అన్నారు. బుధవారం పట్టణంలోని శ్రీసరస్వతి విద్యామందిర్ ఆవరణలో భారత్ స్వాభిమాన్ ట్రస్ట్, పతాంజలి యోగా సమితి, నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏసీపీ రమేశ్, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు.

దుబ్బాకటౌన్: ప్రతి ఒక్కరూ యోగా చేయాలని దీంతో రోగాలు ధరిచేరవని తద్వార ప్రశాంతంగా జీవించవచ్చని ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో బీజేపీ నాయకులతో కలిసి యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ యోగా గురువు దయాకర్, నాయకులు ఉన్నారు.

ములుగు(గజ్వేల్): మండల కేంద్రమైన ములుగు అటవీ కళాశాల పరిశోధన సంస్థ, రాష్ట్ర కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వ విద్యాలయంలో విద్యార్థులు, అధ్యాపకులు బుధవారం రకరకాలుగా యోగాసనాలు వేసి, యోగా ప్రాధాన్యతను తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ఫిజికల్ డైరెక్టర్ ప్రభు, పి.టి నరేశ్, ఉద్యాన విశ్వవిద్యాలయ పి.జి కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మినారాయణ, సిబ్బంది సతీశ్, ఉమేశ్, చందన, పూజ, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటకమాన్: సిద్దిపేట కోర్టు ఆవరణలో న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది యోగాసనాలు వేశారు. ఆరోగ్యంగా ఉండడానికి ప్రతి ఒక్కరూ యోగాను అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ రఘురాం, న్యాయమూర్తులు భవాని, స్వాతిరెడ్డి, శ్రావణియాదవ్, న్యాయవాదులు సత్యనారాయణ, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేటరూరల్: కేంద్రీయ విద్యాలయంలో యోగా చేస్తున్న విద్యార్థులు



చేర్యాల(సిద్దిపేట): యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



చిన్నకోడూరులో..



మిరుదొడ్డి(దుబ్బాక): కాసులాబాద్‌లో..

ఆలయాల అభివృద్ధికి కృషి



మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలుపుతున్న రవీందర్ తదితరులు

కొండపాక(గజ్వేల్): ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని రైతుబంధు సమితీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవి రవీందర్ పేర్కొన్నారు. మండలంలోని లకుడారం, తిమ్మారెడ్డిపల్లి, బొబ్బాయిపల్లి, జప్తినాచారం గ్రామాల్లోని ఆలయాలు దీప దూప నైవేద్యాలకు ఎంపికయ్యాయి. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఎంపిక సర్టిఫికెట్లను ఆయన పూజారులకు అందజేశారు. ఆలయాలు దీప దూప నైవేద్యాలకు ఎంపికవడంతో ఆయా గ్రామాల పూజారులతో రవీందర్ మంత్రి హరీశ్‌రావును కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా దేవి రవీందర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో చాలా ఆలయాలు దీప దూప నైవేద్యాలకు నోచుకోక వెలవెలబోయాయన్నారు. సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చాక ఆలయాల్లో నిత్యం పూజలు జరిగేలా చూసేందుకు దీప దూప నైవేద్యాల పేరుతో పూజారులకు నెల నెల వేతనాన్ని అందజేస్తున్నారన్నారు. దీప దూప నైవేద్యాలకు ఎంపికవడానికి సహకరించిన మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిలకు ఆయా గ్రామాల ప్రజలు, పూజారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, పూజారులు బాలబ్రహ్మం, సాయికుమార్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆధ్యాత్మిక దినోత్సవం



హుస్నాబాద్: ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



జగదేవ్‌పూర్(గజ్వేల్): కొండపోచమ్మ ఆలయం వద్ద సింధూ కళాకారుల ఆటాపాట

హుస్నాబాద్: హుస్నాబాద్ నియోజకవర్గంలో 21 దేవాలయాలకు ప్రభుత్వం ద్వారా దూప దీప నైవేద్యాలు అందుతున్నాయని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని ఎల్లమ్మ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆయనకు అలయ అర్చకులు, సిబ్బంది పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వరాష్ట్రంలో ఆలయాలు అభివృద్ధి చేసుకొని ఆధ్యాత్మిక శోభతో వర్ధిల్లుతున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అనిత, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజని, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ పూదరి లక్ష్మినారాయణ తదితరులు ఉన్నారు.

ఆలయాలకు మహర్దశ

జగదేవ్‌పూర్(గజ్వేల్): రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆలయాలకు మహర్దశ వచ్చిందని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షురాలు కావ్యదర్గయ్య, సర్పంచ్ రజిత అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని కొండపోచమ్మ ఆలయం వద్ద ఆధ్యాత్మిక దినోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ పాలకమండలి సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆలయం వద్ద సింధూ కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఆలయాల అభివృద్ధిపై కళాకారులు ఆటపాట ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు శ్రీనివాస్, రామచంద్రారెడ్డి, మాధవరెడ్డి, కనకయ్య, వెంకట్రామిరెడ్డి, సిబ్బంది వెంకట్‌రెడ్డి, కనకరెడ్డి, కనకయ్య, హరి, చిన్నా, సుధాకర్, లక్ష్మన్ అర్చకులు పాల్గొన్నారు.

రాజేశ్వరస్వామి ఆలయంలో..

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రం అభివృద్ధి సాధించి సాగునీరు కొదవ లేకుండా గోదావరి జలాలతో మెట్ట ప్రాంతం సస్యశ్యామలం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అర్చకుడు సతీశ్‌శర్మ, సర్పంచ్ సుశీల, వైస్ ఎంపీపీ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఆ స్థలాన్ని మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ చేయాలి



స్థలాన్ని పరిశీలిస్తున్న పరిరక్షణ సమితి సభ్యులు

చేర్యాల(సిద్దిపేట): ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తన కూతురు పేరుపై రిజిస్ట్రేషన్ చేయించిన పెద్ద చెరువు మత్తడి వద్ద కాళీ స్థలాన్ని మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ చేయాలని మత్తడి పరిరక్షణ సమితి సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం చెరువు పరిరక్షణ సమితి చైర్మన్ అవుశర్ల యాదయ్య ఆధ్వర్యంలో స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా పెద్ద చెరువు మత్తడి వద్ద ఉన్న స్థలంలో పశువుల అంగడి నడిచేదని, ఆ స్థలాన్ని స్థానిక ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తన కుమార్తె తుల్జాభవానిరెడ్డి పేరుపై రిజిస్ట్రేషన్ చేశారన్నారు. ఈ విషయమై గతంలో పోరాటాలు చేశామన్నారు. ప్రస్తుతం ఆ భూమి ఫోర్జరీ సంతకాలతో రిజిస్ట్రేషన్ చేశారని, అది నాది కాదని ఎమ్మెల్యే కూతురే ఆరోపిస్తున్న క్రమంలో స్థలాన్ని మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పరిరక్షణ సమితి నాయకులు మల్లారెడ్డి, శ్రీనివాస్, అశోక్, బీరయ్య, కళావతి, బాల్‌నర్సయ్య, వెంకట్‌మావో, చిరంజీవులు, అంజయ్య, నాగరాజు, అరుణ్, భాస్కర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, నర్సిరెడ్డి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

30లోపు పన్నులు చెల్లించాలి

చేర్యాల(సిద్దిపేట): ఈ నెల 30లోపు పట్టణ కేంద్రంలోని ఆస్తి పన్ను చెల్లింపుదారులు మొదటి అర్ధ సంవత్సరపు ఆస్తి పన్ను చెల్లించాలని, లేదంటే జూలై 1 నుంచి 2 శాతం జరిమానా విధించబడుతుందని కమిషనర్ రాజేంద్రకుమార్ తెలిపారు. 51రోజు సెలవుపై వెళ్లిన ఆయన బుధవారం తిరిగి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 30లోపు ఆస్తి పన్ను చెల్లించాలన్నారు. అదే విధంగా గత సంవత్సరం ట్రేడ్ లైసెన్స్ పొందిన వారు గత మార్చి 31లోపు రెన్యూవల్ చేసుకోవాల్సి ఉండగా చాలా మంది రెన్యూవల్ చేసుకోలేదు. అట్టి లైసెన్సులను జూలై 30 లోపు 25శాతం జరిమానాతో రెన్యూవల్ చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు లైసెన్సు పొందని వారు వెంటనే సంబంధిత పత్రాలతో ఆన్‌లైన్‌లో లేదా మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసి ట్రేడ్ లైసెన్సు పొందాలన్నారు. పట్టణ పరిధిలోని ఇళ్లకు నల్లా కనెక్షన్ ఉన్న ప్రతీ వినియోగదారుడు నీటి చార్జీలను వెంటనే చెల్లించాలన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించాలి

చేర్యాల(సిద్దిపేట): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు ఈరి భూమయ్య, మండల కమిటీ సభ్యుడు కత్తుల భాస్కర్‌రెడ్డి కోరారు. బుధవారం ఈ విషయమై స్థానిక తహసీల్దార్ ఆరీఫాకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లయ్య, పోచయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలి

రాయపోలు(దుబ్బాక): నూతనంగా పట్టాదారు పాసుపుస్తకాలు అందుకున్న రైతులు రైతుబంధు సాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని దౌల్తాబాద్ మండల వ్యవసాయాధికారి గోవిందరాజులు, ఏఈఓ అంబటి రాజుగౌడ్‌లు తెలిపారు. ఈ నెల 16లో నూతనంగా పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చిన రైతులు ఆధార్‌కార్డు, బ్యాంకుఖాత పుస్తకం, పట్టాదారు పాసుపుస్తకం, ఫోన్ నంబరుతో మీ వ్యవసాయ విస్తరణాధికారిని సంప్రదించాలని కోరారు.

◆ ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి

దుబ్బాక: వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు లింగంపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం దుబ్బాక పట్టణంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 25వ తేదీన సిద్దిపేట పట్టణంలో నిర్వహించనున్న జిల్లా సదస్సుకు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రకాశ్, రాజు, స్వామి, శ్రీనివాస్, పరశురాములు, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

◆ బీడీ కార్మికుల సమస్య పరిష్కరించాలి

సిద్దిపేటజోన్: దేశాయ్ బీడీ యాజమాన్య సంస్థ బీడీ కార్మికులకు చిప్స్ ప్యాకెట్లు విక్రయాలు చేస్తుందని దీన్ని అడ్డుకోవాలని రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు బుధవారం కార్మిక శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఒక్కొక్క ప్యాకెట్‌పై రూ.5 వసూలు చేస్తున్నారని, ఈ విక్రయాలు నిలిపివేయాలని కోరారు. స్పందించిన అధికారి వారం రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

◆ చిరుజల్లుల పలకరింపు

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు, దూళ్మిట్ట మండలాల్లోని పలు గ్రామాల్లో చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. జూన్ ప్రారంభమైన ఉష్ణోగ్రతల్లో ఎలాంటి మార్పు చోటు చేసుకోలేదు. బుధవారం ఉదయం నుంచి ఉక్కపోతగా ఉన్న వాతావరణంలో సాయంత్రం మార్పు కనిపించింది.

◆ పేద విద్యార్థికి సాయం

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడి కుమారుడు సన్నీ ఎంబీబీఎస్ చదువుతున్నాడు. వైద్య విద్యను పూర్తి చేయడానికి పేద కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులు అడ్డురావడంతో కాంగ్రెస్ నాయకుడు మడప యాదవరెడ్డి కాంగ్రెస్ నాయకుడు ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డిని బుధవారం హైదరాబాద్‌లో కలిసి పేద కుటుంబ ఆర్థిక పరిస్థితిని వివరించారు. స్పందించిన ఎంపీ కోమటి రెడ్డి వైద్య విద్య పూర్తి చేసేవరకు తన కుమారుడు ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ ద్వారా ఆర్థికసాయం అందిస్తానని హామీ ఇవ్వడంతో పాటు మొదటి ఏడాది ఫీజు లక్షల రూపాయలు అందించారు. ఈ సందర్భంగా ఎంపీ కోమటిరెడ్డికి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

◆ ఆర్థికసాయం

చేర్యాల(సిద్దిపేట): ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి వెన్నెముఖ సమస్యతో బాధపడుతున్న పట్టణ కేంద్రానికి చెందిన తుమ్మలపల్లి అనిల్‌కు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ బుధవారం రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ పట్టణ యూత్ యాట భిక్షపతి, జనరల్ సెక్రటరీ సాయి, నాయకులు ఉన్నారు.

◆ టీఎస్ఐఐసీ చైర్మన్‌కు పరామర్శ

సిద్దిపేటకమాన్: టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు మాతృమూర్తి కమలమ్మ ఇటీవల మరణించడంతో సిద్దిపేటలో వారి కుటుంబాన్ని బీఆర్‌ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కమలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. వీరి వెంట రాష్ట్ర రైతు విమోచన కమిషన్ చైర్మన్ వెంకన్న, మాజీ మేయర్ బొంతు రాంమోహన్, యాదవరెడ్డి పాల్గొన్నారు.

◆ పోస్టర్ ఆవిష్కరణ

మద్దూరు(హుస్నాబాద్): ఏఐఎస్‌బీ 73వ వార్షికోత్సవాల పోస్టర్‌ను ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షుడు పుల్లని వేణు బుధవారం దూళ్మిట్ట మండల కేంద్రంలో ఆవిష్కరించారు. జూన్ 25 నుంచి నిర్వహించే వార్షికోత్సవాలకు ప్రజలు తరలిరావాలన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ పోరాటం మరువలేనిది



గజ్వేల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

గజ్వేల్‌రూరల్: తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు చేసిన పోరాటం మరువలేనిదని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా బుధవారం గజ్వేల్ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్‌లో జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ సెక్రటరీ జాన్‌వెస్లీ, సిబ్బంది నాగరాజు, ఆంజనేయులు, యాదగిరి, పరశురాములు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, శ్రావణ్, మల్లేశం, రాజేందర్, బాబు, కుమార్, అయిలయ్య పాల్గొన్నారు.

సిద్దిపేటజోన్: పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తాలో ఉన్న జయశంకర్ విగ్రహానికి టీపీటీఎఫ్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, రాములు, జానకీరాములు, శివాజీ, గోపాల్‌రెడ్డి, లింగారెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ సాధన జేఏసీ గ్రామ కమిటీ ఎన్నిక

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన జేఏసీ ముస్త్యాల గ్రామ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. జేఏసీ మండల నాయకుడు కొంగరి వెంకటమావో అధ్యక్షతన రైతు వేదికలో జరిగిన సమావేశంలో జేఏసీ నాయకుడు అందె అశోక్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో కన్వీనర్‌గా కొంగరి వెంకటస్వామి, కోకన్వీనర్లుగా చెరుకు నాగేశ్వర్, అల్లిబిల్లి రాములు, అరకల సూర్యనారాయణ, బాలమల్లయ్య, ఎండీ.అసద్, తాటిపాముల శ్రీనివాస్, యూత్ కన్వీనర్‌గా పెడతల ప్రభాకర్‌రెడ్డి, కోకన్వీనర్లుగా కీసరి మల్లేశం, చింతల విజయ్‌కుమార్, సొంటే రమేశ్, మేరింగ్ల శ్రీనివాస్, మేడిపల్లి రాజుతో పాటు 34 మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో జేఏసీ నాయకులు భూమయ్య, చందు, జైపాల్‌రెడ్డి, కుమార్, యాదయ్య, నాగరాజు, రవీందర్, సుదర్శన్, నర్సయ్య, ఎజాస్, ముస్తాక్, వెంకటయ్య, మైసయ్య, సురేందర్, భూపతి, మురళి, రామస్వామి, షాదుల్లా తదితరులు పాల్గొన్నారు.